# తెలంగాణ జేఏసీ మానిఫెస్టో

తెలంగాణ ఉద్యమాన్ని అభివృద్ధి కొరకు సాగుతున్న ఉద్యమంగానే శ్రీకృష్ణ కమిటీ గుర్తించింది. అభివృద్ధిని సాధించినప్పుడే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యం నెరవేరుతుంది. అందుకై జరుగవలసిన కృషి దిగువ పేర్కొన్న మార్గంలో సాగవలసి ఉంటుంది. ముందుగా తెలంగాణ రాష్ట్ర సాధనకై అమరులైన యువతీ, యువకులను గుర్తు చేసుకోవాలి.

- అమరుల స్మారక స్తూపాన్ని హైదరాబాద్‌లోను, ప్రతి జిల్లా కేంద్రంలోను నిర్మించాలి.
- అమరుల కుటుంబాలకు చేయూతనివ్వాలి. ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన పెన్షన్ లేక కుటుంబంలో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. గృహవసతి ఏర్పాటు చేయాలి. పిల్లలకు పి.జి వరకు ఉచిత విద్యను అందజేయాలి, కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలి.
- ఉద్యమ సందర్భంగా పెట్టిన అన్ని కేసులను బేషరతుగా ఎత్తివేయాలి
- రైల్వే కేసుల ఉపసంహరణకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకొని కృషి చేయాలి.

## పంపకాల విషయంలో

పంపకాలు న్యాయ సమ్మతంగా జరుగడానికి దిగువ చర్యలు తీసుకోవాలి

- స్థానికత ఆధారంగానే ఉద్యోగుల, పెన్షనర్ల పంపిణీ జరుగాలి.
- కార్పొరేషన్ల ఉద్యోగుల పంపిణీలోను, న్యాయవ్యవస్థకు చెందిన ఉద్యోగుల, న్యాయాధికారుల భట్వారాలోను ఇదే సూత్రాన్ని ఖచ్చితంగానే పాటించాలి.
- ఏ ప్రాంతంలోని విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు ఆ ప్రాంతానికే దక్కాలి. ఇందులో ఉత్పత్తి జరిగే విద్యుత్తును ఆ ప్రాంతం అవసరాలకే కేటాయించాలి. విద్యుత్ కేంద్రాల ఏర్పాటులో కాంట్రాక్టీకరణ, ఫ్రాంచైసీ విధానాన్ని ఉపసంహరించుకోవాలి. విద్యుత్ వినియోగంలో పొదుపు చర్యలను పాటించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- తెలంగాణకు ఏర్పాడే విద్యుత్తు లోటును కేంద్రం తన కోటా నుంచి సప్లయి చేసి భర్తీ చేయాలి.
- ముంపు పేరుతో ఆంధ్రకు తరలించిన 135 ఖమ్మం జిల్లా గ్రామాలను తిరిగి పొందడానికి కృషి జరుగాలి.
- పోలవరం ప్రాజెక్టు కింద ముంపును పూర్తిగా నివారించడానికి చర్యలు తీసుకోవాలి.
- వెంటనే హైకోర్టు విభజన జరుగాలి.

## పాలనా రంగంలో

- ప్రభుత్వం పారదర్శకంగా, ప్రజల పట్ల జవాబుదారీ తనంతో పనిచేయాలి. అందుకుగాను పరిపాలనా రంగంలో దిగువ సంస్కరణలు ప్రవేశపెట్టాలి.
- ప్రజలకు చట్టబద్ధంగా సంక్రమించిన హక్కులను ఇనుమడింప జేసే రీతిలో ప్రభుత్వ విధానాలు ఉండాలి. పరిపాలనా విభాగాలు పనిచేయాలి.
- జిల్లాలను పునర్వ్యవస్థీకరించాలి.
- నిధులు, విధులను గ్రామపంచాయతీలకు వికేంద్రీకరించి పంచాయతీ వ్యవస్థను పటిష్టం చేయాలి.
- తండాలను, ఆదివాసీ గూడాలను గ్రామపంచాయతీలుగా ప్రకటించాలి.
- పింఛన్లు, రేషన్ కార్డులతో సహా అన్ని సంక్షేమ పథకాలను ప్రజలు హక్కుగా పొందడానికి అవకాశం కల్పించే చట్టాలను తేవాలి. అందువలన మధ్యదళారుల దోపిడి ఉండదు. లబ్ధిదారులకు పథకాలు ఎటువంటి లింకేజీ లేకుండా చేయాలి.
- అవినీతిని, అధికార దుర్వినియోగాన్ని నివారించడానికి ఇప్పుడున్న చట్టాలు నియంత్రించలేకపోతున్నాయి. అందుకుగాను అందరు అధికారులను అవినీతి నిరోధక యంత్రాంగం పరిధిలోకి తేవాలి. లోక్‌పాల్ తరహ పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.
- ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలకాలి. ఈ విధానలు ప్రభుత్వ ఆస్తులను సమిష్టి ఆస్తులను గుప్పెడు మంది సంపన్నులు కాజేయడానికి ఉపయోగపడినాయి.

## సామాజిక న్యాయం

- తెలంగాణ ప్రజల సామాజిక, ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ విధివిధానాలను, పాలనా సంస్కరణలను రూపొందించి అమలు పరచాలి. విధాన నిర్ణయాలలోనూ, ప్రణాళిక రూపకల్పనలోనూ, పాలనలోనూ తెలంగాణలోని అన్ని సామాజిక వర్గాల ప్రజల భాగస్వామ్యాన్ని ఇతోధికంగా పెంచాలి.
- తెలంగాణ రాష్ట్రంలో లభ్యమయ్యే అన్నిరకాల సహజ, భూగర్భ, తదితర వనరులన్నింటినీ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి, తెలంగాణ ప్రాంత ప్రజల సంక్షేమానికి వినియోగించాలి. స్థానిక వనరుల వినియోగంలో స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని

పెంచడంతోపాటు, వారి అభిప్రాయాలను ఖచ్చితంగా పరిగణలోకి తీసుకోవాలి.
- మైనారిటీలకు, దళితులకు, బహుజనులకు, గిరిజనులకు, ఆదివాసులకు చెందిన హక్కులను పటిష్టంగా అమలు చేయాలి. పాలనా యంత్రాంగంలో అన్ని స్థాయిల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచాలి.
- సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిటీల నివేదికలను అమలు చేయాలి.
- ఆక్రమంలో ఆదివాసుల ప్రయోజనాలను ప్రత్యేకించి రాజ్యాంగంలోని 5వ షెడ్యూలును దృష్టిలో పెట్టుకోవాలి.
- వెనకబడిన తరగతుల అభ్యున్నతికోసం బి.సి. సబ్‌ప్లాన్ రూపొందించి అమలు చేయాలి.
- ఆదివాసీ, గిరిజన, దళిత వర్గాల ప్రజలకు ప్రతి కుటుంబానికి కనీసం ఐదు ఎకరాల సాగుభూమిని కేటాయించి, వ్యవసాయయోగ్యతను కల్పించాలి.
- కేంద్రప్రభుత్వం 2013లో తెచ్చిన భూసంస్కరణల ముసాయిదా బిల్లులోని ప్రతిపాదనల్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి అమలు చేయాలి.
-కోనేరు రంగారావు కమిటీ చేసిన పేద ప్రజలకు ఆదివాసీలకు, దళితులకు ఉపయోగపడే సిఫారసులను అమలు చేయాలి. - 1 ఆఫ్ 70 చట్టాన్ని ధృఢంగా అమలు చేయాలి. ముఖ్య మూల ఆదివాసీలైన కోయ, గోండు, కొండరెడ్డి తదితర తెగల ఆదివాసీలకు ప్రత్యేక రక్షణలు కల్పించాలి.
- 1956 నుండి హైదరాబాద్ చుట్టుపక్కల చట్ట వ్యతిరేకంగా అన్యాక్రాంతమైన ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, వక్ఫ్ భూముల కేటాయింపులపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కాలపరిమితితో కూడిన విధంగా సమగ్ర న్యాయవిచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలి. - ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)ల పేరుమీద వివిధ సంస్థలకు కేటాయించిన భూముల విన్నియోగం విషయంలో సమగ్ర దర్యాప్తు జరిపించి, దుర్వినియోగం లేదా పడావుగా ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, భూమి లేని నిరుపేదలకు ఆ భూములను పంపిణీ చేయాలి.

## ఉపాధి కల్పన

- గ్రామాలలో, గ్రామీణ ప్రాంతాలలో బతుకుదెరువు అవకాశాలను కల్పిస్తున్న చేపల పెంపకం, పండ్లు ఇతర ఆహార ఉత్పత్తుల సేకరణ, అన్ని వృత్తులను - వ్యవసాయం, పశుపోషణ, చేతివృత్తుల వంటివి ప్రభుత్వం రక్షించాలి, ఆధునీకరించాలి. అందుకు గాను దిగువ చర్యలు తీసుకోవాలి.
- ప్రభుత్వం వృత్తులను నిలబెట్టడానికి వనరులను, ముడిసరుకులను చవక ధరకు ఎప్పటికప్పుడు, అవరానికి తగినట్లుగా అందజేయాలి.
- ఉత్పత్తుల విలువలకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.
- ఉత్పత్తి సామర్థ్యాన్ని నాణ్యతను పెంచడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి.
- కొన్ని ఉత్పత్తులను గ్రామీణ పరిశ్రమలకు చేతివృత్తుల రంగాలకు రిజర్వు చేయాలి.
- ఉత్పత్తుల అమ్మకాలకు మార్కెట్ సౌకర్యాలను కల్పించాలి.

## పట్టణాలలో

- పట్టణాలలోను వృత్తులను పైన వివరించిన విధంగా రక్షించాలి, ఆధునీకరించాలి
- సూక్ష్మ పరిశ్రమలను పెంపొందించడానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఈ పరిశ్రమలలో పెట్టుబడి తక్కువ. తొందరగా ఉత్పత్తి మొదలవుతుంది. కాబట్టి ఉపాధి అవకాశాలను వేగంగా పెంచవచ్చు. ఇప్పుడు పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించడానికి ఏర్పడిన సంస్థలన్నీ భారీ, మధ్యతరహా పరిశ్రమలకే ఉపయోగపడుతున్నాయి. అందుకని సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రత్యేక బోర్డులను, కార్పొరేషన్లను ఏర్పరచాలి.
- సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు భూమిని కేటాయించడమే కాక మౌలిక సదుపాయాలను కూడా కల్పించాలి.
- పారిశ్రామిక క్లస్టర్లతో, భారీ పరిశ్రమలతో అనుసంధానం చేయాలి.
- తక్కువ వడ్డీకి రుణాలను అందించాలి.
- వ్యవసాయానికి అనుబంధంగా సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించాలి.

## చిన్న, భారీ, మధ్యతరహా పరిశ్రమలు

- నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండాలి. అందుకు గాను విద్యుత్తు ఉత్పాదన పెంచాలి
- ఇప్పుడున్న పరిశ్రమలను ఆదోవాలి. ఖాయిలా పడిన పరిశ్రమల పరిరక్షణకు విధానం ప్రకటించాలి.
- కొత్త పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక కారిడార్లను ఏర్పరచాలి. భారీ పరిశ్రమలతోను, సింగరేణికి అనుబంధంగాను చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి.
- పారిశ్రామిక అభివృద్ధికి అనుసంధానం చేస్తూ ప్రత్యేక శిక్షణ మరియు విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి. వాటికి అనుబంధంగా ఆన్సిలరీలను ఏర్పాటు చేయాలి.
- అన్ని కంపెనీలలోను 80శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలి.
- వరంగల్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేయాలి.

## వ్యవసాయం, పశుపోషణ

- తెలంగాణలో వ్యవసాయం చిన్న, సన్న రైతుల చేతుల్లోనే ఉన్నది. ఈ రైతులను ఆదుకుంటేనే వ్యవసాయం వృద్ధి చెందుతది. అందుకని చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ విధానాలను పెంపొందించాలి.
- సాగునీటి సౌకర్యం కల్పించాలి. అందుకుగాను చెరువులను మరమ్మతు చేసి పునరుద్ధరించాలి. చెరువులను పునరుద్ధరించడమంటే కేవలం కట్టను మరమ్మతు చేయడమే కాదు. దానితో పాటు తూమును, మత్తడిని, కట్టు కాల్వలు, పంట కాల్వలను కాపాడాలి. శిఖం భూమి నుంచి పూడిక తొలగించాలి. పదుబాటు ప్రాంతంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలి.
- చెరువుల స్థితిగతులపై సాలుసరి నివేదికలు ప్రతిగ్రామం నుంచి పంపించడానికి యంత్రాంగం ఉండాలి. ఆ నివేదికల ఆధారంగా చెరువుల మరమ్మతులకు తగు నిధులు కేటాయించాలి.
- అవకాశం ఉన్నచోట కొత్త చెరువుల నిర్మాణానికి పూనుకోవాలి.
- నిర్మాణంలోనున్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలి. అవసరమైన చోట ప్రాజెక్టులను, చెరువులను అనుసంధానం చేయాలి.
- ప్రాణహిత-చేవెళ్ల, పాలమూరు ఎత్తిపోతల పథకాలను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించాలి.
- బోర్లు, బావుల తవ్వకానికి పావలా వడ్డీకే రుణం ఇవ్వాలి.
- నాణ్యమైన విత్తనాల ఉత్పత్తిని స్థానికంగానే ప్రోత్సహించాలి.
- ఆ విత్తనాలను రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి సకాలంలో ఇతర రైతులకు అందించాలి.
- ఎరువులను సకాలంలో, కావలసినంత మొత్తంలో అందించడానికి ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలి.
- రైతుల ఉత్పత్తులను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర చెల్లించాలి.
- తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయడానికి అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించి, విస్తరణ సేవల ద్వారా రైతులకు అందించాలి. హానికరమైన రసాయనాలను, బయోటెక్నాలజీని నిషేధించాలి. పర్యావరణానికి నష్టం కలిగించని సుస్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి.
- వ్యవసాయ ఉత్పత్తుల నిలువకు గోదాములను నిర్మించాలి.
- రైతులకు కావలసిన రుణ సదుపాయాన్ని సహకార సంస్థలు, బ్యాంకుల నుంచ తక్కువ వడ్డీకి అందజేయాలి.
- చిన్న, సన్న రైతులు తమకు తాముగా మార్కెట్ శక్తులను తట్టుకోలేరు. అందుకోసం రైతుల సహకార సంస్థలను ప్రోత్సహించి మార్కెట్ ఆటుపోట్ల నుంచి తట్టుకోవడానికి తోడ్పడాలి. సహకార సంఘాలుగా ఏర్పడితే రైతులు విత్తనాలు, ఎరువులు, రుణసౌకర్యాన్ని సమకూర్చుకోవడానికి ఉత్పత్తులను లాభసాటిగా అమ్ముకోవడానికి కావాల్సిన బలాన్ని సమకూర్చుకోగలరు.
- వ్యవసాయంతో పాటు మత్స్య పరిశ్రమను, పశుపోషణను, కోళ్ళ పెంపకాన్ని ప్రోత్సహించాలి. ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రభుత్వమే అవకాశాలను కల్పించాలి.
- ఇప్పుడున్న రుణాలను మాఫీ చేయాలి.
- వడగళ్ళ వానలు, తుఫానులు, గాలిదుమారాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలి. పేరుకొనిపోయిన బకాయిలను వెంటనే చెల్లించాలి.

## విద్యుత్తు

- 24 గంటలు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలి.
- రైతులకు రాత్రి కాకుండా, పగటి పూటనే విద్యుత్తు సరఫరా చేయాలి.
- విద్యుత్తు ఉత్పత్తిని పెంచడానికి సౌరవిద్యుత్తు ఉత్పత్తిని ప్రోత్సహించాలి. ప్రభుత్వ ఆధీనంలోనే ఉత్పత్తి జరుగాలి.

## విద్యారంగం

- కార్పొరేట్ వ్యవస్థను నిర్మూలించి అందరికీ విద్యను అందజేయడానికి ప్రభుత్వ ఆధీనంలోని విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి.
- ఇంగ్లీషు మీడియం సెక్షన్లను ప్రభుత్వ స్కూళ్లలోను ఏర్పరచాలి.
- ప్రతి మండలానికొక రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పరచి హైస్కూల్ విద్యార్థులందరికీ ఉచితంగా రెసిడెన్షియల్ విద్యను అందించాలి.
- స్కూలు, కాలేజీలు, యూనివర్సిటీలలో ఖాళీలను పూరించాలి.
- విద్యారంగానికి కావలసిన నిధులను కేటాయించాలి. ప్రత్యేకించి యూనివర్సిటీలకు బ్లాక్ గ్రాంటులను పెంచాలి.

## వైద్యం

- కార్పొరేట్ వైద్యాన్ని నియంత్రించాలి.

- ప్రజలందరికీ ఉచిత వైద్యాన్ని అందించే రీతిలో ప్రభుత్వ వైద్యశాలలను పటిష్టం చేయాలి.
- ప్రభుత్వ రంగంలో మరిన్ని మెడికల్ కాలేజీలను ఏర్పరచాలి.
- వైద్య యూనివర్సిటీని నెలకొల్పాలి.
- ఆర్.ఎం.పిలకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికేట్లు మంజూరు చేయాలి.
- పరిశుభ్రమైన మంచినీటిని అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో ప్రభుత్వం సరఫరా చేయాలి.
- ఫ్లోరోసిస్ ఉన్న ప్రాంతాలలో, అన్ని ఆదివాసీ ప్రాంతాలలో మంచినీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలి.

## పట్టణాభివృద్ధి

- పాలనా యంత్రాంగాన్ని, పరిశ్రమలను, విద్యా వ్యవస్థలున ఒకేచోట కేంద్రీకరించ వద్దు.
- అన్ని పట్టణాల అభివృద్ధికి కృషి జరుగాలి. అందుకు గాను పారిశ్రామిక వాడలను, ఐ.టి కారిడార్‌ను జిల్లాలో పెంపొందించాలి.
- హైదరాబాద్‌కు అనుబంధంగా శాటిలైట్ పట్టణాలను అభివృద్ధి చేయాలి.
- హైదరాబాద్ శివారులోని మున్సిపాలిటీలను పునరుద్ధరించాలి.
- హెచ్ఎండీఏ చట్టాన్ని సవరించి జంటనగరాల సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి.
- మురికి వాడలలో పక్కా ఇళ్ళను నిర్మించి విద్యుత్తు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలను కల్పించి అభివృద్ధి చేయాలి.
- పేద, మధ్యతరగతి ప్రజల ఉపాధి అవకాశాలను పెంపొందించే రీతిలో నగరాల రూపకల్పన జరుగాలి.
- హైదరాబాద్‌లోను జిల్లా కేంద్రాలలోను ప్రజల రవాణా వ్యవస్థను పెంపొందించాలి.
- హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రాలకు మధ్యనున్న రైల్వేలైన్లలో ఒక్క వరంగల్‌కు మాత్రమే డబుల్ లైన్ ఉన్నది. నిజామాబాద్, వికారాబాద్, నల్గొండ రూట్లలో రైల్వేలైన్ డబ్లింగ్ చేసి రైళ్లు పెంచాలి. కరీంనగర్‌కు రైల్ లింకు తొందరగా చేపట్టాలి.

## ఉద్యోగులు, కార్మికులు

- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను స్థానికత ఆధారంగా క్రమబద్ధీకరించాలి
- ప్రభుత్వ ఆఫీసులలో, కార్పొరేషన్లు, బడులు, కాలేజీలు, యూనివర్సిటీలలో ఖాళీలను పూరించాలి.
- అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు దక్కాలి. ఉద్యోగ భద్రతను కల్పించాలి.
- కార్మికులందరికి పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ సౌకర్యాలను అందజేయాలి.
- పారిశ్రామిక వాడలకు అనుబంధంగా కార్మికులకు
- కాలనీలను అభివృద్ధి చేయాలి గృహవసతిని కల్పించాలి. నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందజేయాలి.
- వలస కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక శాఖను ఏర్పరచాలి.
- ఎమిగ్రేషన్ చట్టాన్ని పకడ్బంధీగా అమలు చేయాలి.
- ఇతర దేశాలకు రిక్రూట్‌మెంట్ చేసే ఏజెంటు వ్యవస్థను రద్దు చేసి ఆ బాధ్యతను ప్రభుత్వమే నిర్వహించాలి.
- ప్రైవేటు రంగంలో పని చేసే కార్మికులకు, పత్రికా విలేకరులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

## పర్యావరణం

కొండలు, గుట్టలను వాటిపై పెరిగే చెట్లు, చేమలను కాపాడాలి. అందువల్ల వాటి నుంచి వచ్చే జలధారలను కాపాడవచ్చు.
- గ్రానైట్ మైనింగ్ మరియు ఎగుమతులను నిషేధించాలి.
- పారిశ్రామిక కాలుష్యాన్ని అరికట్టాలి.
- పర్యావరణ విధ్వంసానికి కారణమవుతున్న ఓపెన్ కాస్టు బొగ్గు గనులను ఆపాలి

## సంస్కృతి - పర్యాటక రంగం

- తెలంగాణ భాష, యాసలను కాపాడటానికి వాడకాన్ని పునరుద్దరించాడానికి తెలుగు యూనివర్సిటీలు, తెలుగు అకాడమీలు కృషి చేయాలి.
- తెలంగాణ జానపద కళల పరిరక్షణ బాధ్యతను తెలుగు యూనివర్సిటీలకే అప్పగించాలి.
- జానపద కళాకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి.
- చారిత్రక కట్టడాలను, అవశేషాలను, ప్రదేశాలను పౌరసత్వ సంపదగా గుర్తించి పరిరక్షించాలి. వాటిని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి.
- తెలంగాణలో సినిమా రంగాన్ని ప్రోత్సహించాలి. తెలంగాణ కళాకారులు నిర్మించిన సినిమాలకు పూర్తిగా ట్యాక్స్ రిబేట్లు ఇవ్వాలి
- కళాకారుల నైపుణ్యాన్ని పెంచడానికి ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలి.